JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 19-08-2026
Medchal - Malkajgiri | Wednesday 19-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 79
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 79 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com




## 22ఏ జాబితాలో మీ భూమి ఉందా?

- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు.. 2 రోజుల్లోనే పరిష్కారం!
- జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు

జయభేరి, హైదరాబాద్:

22ఏ నిషేధిత భూముల జాబితా కారణంగా రిజిస్ట్రేషన్ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజమానులకు తెలంగాణ ప్రభుత్వం కీలక భరోసా ఇచ్చింది. ప్రైవేట్ భూముల యజమానుల ఆస్తి హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనవసర జాప్యం లేకుండా వ్యవస్థను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. ఆస్తులు కలిగి ఉన్న అర్హులైన వ్యక్తులు తమ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న వారి ఆస్తి 22ఏ జాబితాలో ఉన్నట్లయితే, సంబంధిత రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లోగా ఆ భూమిని పరిశీలించాలి. అది ప్రైవేట్ భూమిగా నిర్ధారణ అయితే వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 22ఏ జాబితాలో ఉన్న భూములను జిల్లా కలెక్టర్లు సమగ్రంగా పరిశీలించాలని సీఎం ఆదేశించారు. భూముల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా సరైన జాబితాను రూపొందించాలని సూచించారు. ఆ జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

# ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తాం




- 22ఏ ద్వారా ఈ ప్రభుత్వం భూ దొంగతనానికి రాచబాట వేసుకుంటోంది
- పేదల భూములను పరిశ్రమల పేరుతో లాక్కుంటే ఊరుకోం
- తెలంగాణ ఉద్యమకారులను విజయశాంతి ని ఎమ్మెల్సీ చేసి సైలెంట్ చేశారు : కవిత

జయభేరి, హైదరాబాద్:

తెలంగాణ రక్షణ సేన (TRS) చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదల కోసం భూలక్ష్మి పథకాన్ని తీసుకొస్తామని అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ జరగాలి అని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామని కవిత సంచలన హామీ ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేనచీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదల కోసం భూలక్ష్మి పథకాన్ని తీసుకొస్తామని అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ జరగాలి అని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామని కవిత సంచలన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రేవంత్ రాక్షస రాజ్యం (ఆర్ ఆర్ ఆర్) నడుస్తోందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు భూ దొంగలు అంటూ ఆమె ఫైర్ అయ్యారు. సామాజిక అన్యాయం అనాల్సిన ముఖ్యమంత్రి సామాజిక న్యాయం అంటున్నారని మండిపడ్డారు. ఆయనది సామాజిక న్యాయం కాదు ఆటవిక న్యాయం అని ఎద్దేవా చేశారు. 22ఏ ద్వారా ఈ ప్రభుత్వం భూ దొంగతనానికి రాచబాట వేసుకుంటోందని మండిపడ్డారు. పేదల భూములను పరిశ్రమల పేరుతో లాక్కుంటే ఊరుకోం వారి కోసం మేము కొట్లాడుతామని స్పష్టం చేశారు. "మేము సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ పెట్టిన తర్వాతే ముఖ్యమంత్రి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. మా సభ తర్వాత కచ్చితంగా సామాజిక తెలంగాణ గురించి మాట్లాడే అనివార్యత వస్తుందని చెప్పాం. ఇప్పుడు అదే జరిగింది.

...మిగతాది 2 లో



## 8452 కోట్ల బ్యాలెన్స్..!

### ఎట్టకేలకు పీఎం కేర్స్ గుట్టు రట్టు

- విపత్తులను ఎదుర్కోవడానికి ఈ పీఎం కేర్స్ నిధిని ఏర్పాటు

జయభేరి, న్యూఢిల్లీ:

ప్రధాన మంత్రి సహాయ నిధి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం కేర్స్ నిధికి వస్తున్న విరాళాలపై విపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో .. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత కేంద్రం ఈ వివరాలను బయటపెట్టింది. 2025 మార్చి 31 నాటికి తమ వద్ద రూ.8,452 కోట్లు ఉన్నట్లు పీఎం కేర్స్ వెల్లడించింది. ఈ మేరకు తమ వెబ్ సైట్ లో ఆడిట్ నివేదికల వివరాలను కేంద్రం తాజాగా అప్ లోడ్ చేసింది. పీఎం కేర్స్ నిధికి సంబంధించి న 2023-24, 2024-25

...మిగతాది 2 లో

## బాలికలపై ఖర్చు కాదు.. భవిష్యత్తుపై పెట్టుబడి

పేజీ 7





## లవర్ ను చంపి.. గోనెసంచిలో కుక్కి..

- గర్భవతి అయిన తర్వాత పెళ్లి చేసుకోవాలని ఆ యువతి ఒత్తిడి
- సినిమాలలో క్రైం సీన్లు చూసీ, చూసీ అలవాటు పడుతున్న జనాలు
- ప్రేమ పేరుతో అమ్మాయిలను వాడుకోవటం, ఆపై పరలోకాలకు పంపించటం
- అర్ధరాత్రి సమయంలో వారి కదలికలపై అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం

జయభేరి, హైదరాబాద్ :

రోజురోజుకీ సమాజంలో దారుణాలు పెరిగిపోయాయి. సినిమాలలో క్రైం సీన్లు చూసీ, చూసీ అలవాటు పడుతున్న జనాలు క్రైమ్స్ ను చాలా సునాయాసంగా చేసేస్తున్నారు.



## బీసీ రిజర్వేషన్ల పెంపు

- ఏపీలో బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం
- జడ్పీల పెంపు -మేయర్, ఛైర్మన్ కు ప్రత్యక్ష ఎన్నికలు

జయభేరి, అమరావతి :

ఏపీలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని కూటమి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. దీన్ని అసెంబ్లీలో సీఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు సీఎం తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం కూడా నిర్వహించినట్లు వెల్లడించారు. అలాగే 28 జిల్లాలకూ జెడ్పీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు మేయర్, ఛైర్మన్లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తొలిసారిగా రిజర్వేషన్‌లను వర్తింప చేస్తూ ఎన్టీఆర్ నాడు తీసుకున్న నిర్ణయం మొదలుకుని ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను సీఎం చంద్రబాబు సభలో వివరించారు. ఉమ్మడి రాష్ట్రానికి తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను చేసిన పంచాయతీరాజ్ చట్ట ప్రకారం రిజర్వేషన్ల పెంపును అమలు చేస్తున్నట్టు తెలిపారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో 34 శాతం రిజర్వేషన్‌లతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించినట్టు గుర్తు చేశారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌లను 24 శాతానికి కుదించడం ద్వారా 16800 మంది స్థానిక బీసీ నేతలకు రాజకీయాల్లో

...మిగతాది 2 లో

# తప్పును ఒప్పుకొని సరిదిద్దుతున్నాం

- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- 22ఎకు సంబంధించి 24గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు చేశాం
- సామాన్య ప్రజల హక్కులు, ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించే బాధ్యత మాది
- 15 రోజుల పాటు రోజువారీగా దరఖాస్తుల పరిశీలన
- మీడియాతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జయభేరి, హైదరాబాద్:

ఇది పేదల ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయదని. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదని వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రిమాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోమారు స్పష్టం చేస్తూ సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30,

...మిగతాది 2 లో



## చంటిబిడ్డతో అసెంబ్లీ సమావేశాలకు టీవీకే ఎమ్మెల్యే పల్లవి

2 లో

# బాలికలపై ఖర్చు కాదు.. వారి భవిష్యత్తుపై పెట్టుబడి



- సామాజికవేత్త చందన.. సూటి ప్రశ్న...
- ప్రభుత్వ పథకాలు బాలికల విద్య సాధికారత ఆర్థిక స్వావలంబనకు మార్గ దర్శకాలవ్వాలి

జయభేరి స్పెషల్ స్టోరీ

ఒక బాలికకు 18 సంవత్సరాలు నిండినప్పుడు మన సమాజంలో మొదట వినిపించే ప్రశ్న "పెళ్లి ఎప్పుడు?" కాకుండా "ఆమె చదువు ఎలా కొనసాగుతుంది? ఆమె భవిష్యత్తు లక్ష్యం ఏమిటి?" అనే ప్రశ్న కావాలి. 18 సంవత్సరాలు చట్టబద్ధమైన వివాహ వయస్సు కావచ్చు. కానీ అది పెళ్లి చేసుకోవాల్సిన గడువు కాదు. అది ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, తన జీవితంపై తానే నిర్ణయం తీసుకునే దిశగా ముందుకు సాగే వయస్సు. ఈ నేపథ్యంలో అసోం ప్రభుత్వం అమలు చేస్తున్న 'ముఖ్యమంత్రి నిజుత్ మొయినా అసోని' (Nijut Moina) పథకం ఒక మంచి విధాన ఆలోచనను మన ముందుకు తీసుకొస్తోంది. ఈ పథకం బాలికలు ఉన్నత విద్యను కొనసాగించేలా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది. 2025-26లో ఉన్నత మాధ్యమిక స్థాయిలో చదివే బాలికలకు నెలకు ₹1,000, డిగ్రీ విద్యార్థినులకు ₹1,250, పీజీ/B.Ed. విద్యార్థినులకు ₹2,500 వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. చదువును కొనసాగించడం, డ్రాప్‌అవుట్‌ను తగ్గించడం వంటి లక్ష్యాలతో ఈ పథకం అమలు చేస్తున్నారు. ముఖ్యంగా బాలికకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం ఆమె వివాహానికి కాదు, ఆమె విద్యకు అనుసంధానమై ఉండటం ఈ పథకంలోని ముఖ్యమైన అంశం.

తెలంగాణ కూడా ఇలాంటి ఆలోచనను సీరియస్‌గా పరిశీలించాల్సిన సమయం వచ్చింది. రాష్ట్రంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు అర్హత కలిగిన కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. ఈ పథకాల సామాజిక అవసరాన్ని పక్కన పెట్టకుండా, అదే సమయంలో బాలికల విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేకంగా పెట్టుబడి పెట్టే పథకాలను రూపొందించాలి. బాలికకు పెళ్లి చేసుకునే సమయంలో మాత్రమే కాకుండా, చదువుకునే ప్రతి దశలో ప్రభుత్వం అండగా ఉండాలి. ఇటీవల విడుదలైన NFHS6 (2023-24) గణాంకాలు కూడా ఈ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. దేశంలో 15-19 సంవత్సరాల వయస్సు గల బాలికల్లో 6.7 శాతం మంది ఇప్పటికే తల్లులుగా ఉన్నారు లేదా సర్వే సమయంలో గర్భిణులుగా ఉన్నారు. తెలంగాణలో ఈ శాతం 6.0గా నమోదైంది. తెలంగాణలో 20-24 సంవత్సరాల వయస్సు గల మహిళల్లో 17.9 శాతం మందికి 18 ఏళ్లు పూర్తికాకముందే వివాహం జరిగినట్లు NFHS6 గణాంకాలు సూచిస్తున్నాయి. పరిస్థితి మెరుగుపడుతున్నప్పటికీ, ఈ సంఖ్య మనం ఇంకా చేయాల్సిన పని ఎంతో ఉందని చెబుతోంది.

చిన్న వయస్సులో వివాహం, ఆ తర్వాత త్వరగా గర్భధారణ జరిగితే బాలిక ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉంది. కౌమార దశలో గర్భధారణ రక్తహీనత, పోషకాహార లోపం, గర్భధారణ మరియు ప్రసవ సమయంలో ఆరోగ్య సమస్యల వంటి ప్రమాదాలను పెంచవచ్చు. పుట్టబోయే శిశువుకు కూడా ముందస్తు ప్రసవం, తక్కువ జనన బరువు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఒక బాలిక చిన్న వయస్సులోనే తల్లిగా మారితే ఆమె చదువు ఆగిపోవడం, ఉద్యోగ అవకాశాలు తగ్గడం, ఆర్థికంగా ఇతరులపై ఆధారపడటం వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు.

నేటి తరం బాలికలకు గత తరాల మాదిరిగా జీవితాన్ని కేవలం పెళ్లి, కుటుంబ బాధ్యతలతో పరిమితం చేయడం సరైంది కాదు. నేడు విద్య, డిజిటల్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి విద్య, ఆర్థిక అక్షరాస్యత, ఉద్యోగ నైపుణ్యాలు అత్యంత అవసరం. ఒక బాలిక డాక్టర్, ఇంజనీర్, టీచర్, లాయర్, పోలీస్ అధికారి, శాస్త్రవేత్త, వ్యాపారవేత్త లేదా తనకు నచ్చిన రంగంలో నిపుణురాలిగా ఎదగగలదు. ఆమెకు ఆ అవకాశం ఇవ్వడం కుటుంబం మాత్రమే కాదు, ప్రభుత్వం, సమాజం కూడా బాధ్యతగా తీసుకోవాలి. అందుకే బాలికల విద్య మరియు సాధికారత కోసం ప్రత్యేక ప్రభుత్వ పథకాలను రూపొందించాలి. ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ, ప్రొఫెషనల్, టెక్నికల్ విద్య, పీజీ, నైపుణ్య శిక్షణ వరకు బాలికలకు దశల వారీగా ఆర్థిక ప్రోత్సాహం ఇవ్వవచ్చు. హాస్టల్, సురక్షిత రవాణా, డిజిటల్ సౌకర్యాలు, కెరీర్ కౌన్సెలింగ్, నైపుణ్య శిక్షణ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కూడా ఈ పథకాలతో అనుసంధానం చేయాలి. ముఖ్యంగా పేద కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు, చదువు మధ్యలో మానేసే ప్రమాదం ఉన్న బాలికలకు ప్రత్యేక సహాయం అందించాలి. ఇలాంటి పథకాలు కేవలం డబ్బు ఇవ్వడం కోసం కాకుండా బాలికను స్వతంత్రంగా నిలబడేలా చేయడం కోసం ఉండాలి. ఆమె చదువు కొనసాగిస్తే ప్రోత్సాహం, నైపుణ్యం నేర్చుకుంటే ప్రోత్సాహం, ఉన్నత విద్యలో చేరితే ప్రోత్సాహం, ఉద్యోగం లేదా స్వయం ఉపాధి వైపు అడుగు వేస్తే మార్గదర్శకత్వం.. ఇలా ప్రభుత్వం బాలిక జీవితంలోని ప్రతి ముఖ్య దశలో భాగస్వామిగా ఉండాలి. బాల్య వివాహాలను అరికట్టడానికి చట్టాలు, పోలీసు చర్యలు అవసరం. కానీ చట్టం ఒక్కటే సరిపోదు. కుటుంబానికి ఒక మంచి ప్రత్యామ్నాయం కనిపించాలి. "అమ్మాయిని ఇప్పుడు పెళ్లి చేయకపోతే ఆమె భవిష్యత్తు ఏమిటి?" అనే ప్రశ్నకు ప్రభుత్వం, సమాజం కలిసి "ఆమె చదువుతుంది, ఆమెకు నైపుణ్యం వస్తుంది, ఆమె ఉద్యోగం చేస్తుంది, ఆమె తన భవిష్యత్తును తానే నిర్మించుకుంటుంది" అనే సమాధానం ఇవ్వాలి. మన సంక్షేమ విధానాలు కూడా ఈ మార్పును ప్రతిబింబించాలి. వివాహానికి సంబంధించిన ఆర్థిక సహాయంతో పాటు, బాలిక విద్య, సాధికారతకు అంతే ప్రాధాన్యత ఇచ్చే పథకాలు ఉండాలి. ఒక కుటుంబానికి ఒకసారి ఇచ్చే సహాయం కంటే, ఒక బాలిక భవిష్యత్తులో పెట్టే నిరంతర పెట్టుబడి సమాజానికి ఎక్కువ ప్రయోజనం ఇస్తుంది. ఒక బాలిక చదువుకుంటే ఒక కుటుంబం మారుతుంది.

ఆమె ఆర్థికంగా స్వతంత్రురాలైతే ఒక తరం మారుతుంది. ఆమె తన జీవితంపై తానే నిర్ణయం తీసుకోగలిగితే సమాజం మారుతుంది. అందుకే మనం అడగాల్సిన ప్రశ్న "18 ఏళ్లకు పెళ్లికి ఎంత సహాయం ఇవ్వాలి?" కాదు. "18 ఏళ్ల తర్వాత బాలిక చదువు, ఆరోగ్యం, నైపుణ్యం, ఉపాధి, ఆర్థిక స్వావలంబన కోసం ఎంత పెట్టుబడి పెట్టాలి?" అనేదే. బాలికను పెళ్లికి సిద్ధం చేయడం కంటే జీవితానికి సిద్ధం చేయాలి. 18 ఏళ్లు పెళ్లికి గడువు కాదు.. అవకాశాలకు ప్రారంభం. తెలంగాణలో బాలికల విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఉపాధి మరియు ఆర్థిక సాధికారతను కేంద్రంగా చేసుకుని కొత్త పథకాలను రూపొందించడం కాలానుగుణమైన అవసరం. బాలికలపై ఖర్చు కాదు.. వారి భవిష్యత్తుపై పెట్టుబడి. అదే నిజమైన సాధికారత.



కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు,
బెస్ట్ ఆడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత



## బంగారు మైసమ్మ బోనాల ఏర్పాట్లపై సమీక్ష

జయభేరి, మేడిపల్లి :

బోడుప్పల్ ఈ నెల 23న జరగనున్న బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, మేడిపల్లి సీఐ జలేందర్‌తో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు పొగుల నర్సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, కొత్త కిషోర్ గౌడ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పొగుల దిలీప్ రెడ్డి, రసాల వెంకటేష్ యాదవ్, ధనగళ్ల యాదగిరి, చిరాల నర్సింహారెడ్డి, ఆలయ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి



జయభేరి, కాప్రా :

చర్లపల్లి డివిజన్‌లో ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులు ప్రారంభం కాకుండా పెండింగ్‌లో ఉండటంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు MMC కమీషనర్ వినయ్ కృష్ణరెడ్డి IAS ని కలిసి మంజూరైన పనుల వివరాలను ఎమ్మెల్యే చర్చించారు. నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మంజూరైన పనులను ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన నూతన అభివృద్ధి పనులకు కూడా అవసరమైన నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## 22ఏ నిషేధిత జాబితా భూ బాధితుల సమావేశం



జయభేరి, ఉప్పల్ :

22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ బాధితుల సమస్యల పరిష్కారం కోసం మల్కాజ్‌గిరిలో సమావేశం నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొని భూ బాధితులతో మాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో ఎదురవుతున్న సమస్యలు, భూ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని భూ బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. నిషేధిత జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. భూ బాధితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆయకట్టుకు నీటి విడుదల



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్ సాగర్ నుండి ఆయకట్టుకు బుధవారం సాగునీటిని విడుదల చేస్తారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్), పర్ణిక రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నుండి నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తారు. కావున ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు ఆయకట్టు, రైతులు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ



## పూజలందుకొన్న బాలాంజనేయ స్వామి

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ సమీపంలోనున్న రాంనగర్ లో కొలువుదీరిన బాలాంజనేయ స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం పురోహితుడు రాజమూరి హన్మేష్ చారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు .ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు, తదితర ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయనకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఘనంగా నివాళులర్పించారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం

జయభేరి, హైదరాబాద్ :



తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు అధ్యక్షతన ఆయన నివాసంలో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ నేపథ్యంలో కమిటీ ఇప్పటికే వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి ఉద్యమకారులు, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాలు మరియు సమాజంలోని సబ్బండ వర్గాల ప్రతినిధులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపింది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వివిధ వర్గాల నుంచి వారి అనుభవాలు, అభిప్రాయాలు, సలహాలు, సూచనలను కమిటీ స్వీకరించింది. ఉద్యమ స్వరూపం, వివిధ దశల్లో ప్రజల భాగస్వామ్యం, ఉద్యమకారుల గుర్తింపునకు అవసరమైన ప్రమాణాలు తదితర అంశాలపై వచ్చిన సూచనలను సమావేశంలో సమీక్షించారు. స్వీకరించిన సలహాలు, సూచనలు, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి, త్వరలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం కానుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారుల సేవలను సముచితంగా గుర్తించి, పారదర్శకంగా, సమగ్రంగా గుర్తింపు కల్పించేందుకు కమిటీ కట్టుబడి ఉందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారు.

# బ్లడ్ బ్యాంక్.. డయాగ్నస్టిక్ సెంటర్ మంజూరు చేయాలి

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి

జయభేరి, ఉప్పల్ :



ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌తో పాటు సమగ్ర డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ నియోజకవర్గ జనాభా వేగంగా పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం ఈ ప్రాంతంలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్, పూర్తి స్థాయి ప్రభుత్వ డయాగ్నస్టిక్ సెంటర్ అందుబాటులో లేవని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు CBC, బ్లడ్ షుగర్, LFT, KFT, USG తదితర ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకోవడానికి ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలను ఆశ్రయించడం ఆర్థిక భారంగా మారుతోందన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, CHCలు, PHCల్లో సకాలంలో వైద్య సేవలు అందించేందుకు అవసరమైన డయాగ్నస్టిక్ సదుపాయాలు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గంలో కాంపోనెంట్ సెపరేషన్ సదుపాయంతో కూడిన ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ మరియు పాథాలజీ, రేడియాలజీ, USG వంటి అవసరమైన సేవలతో కూడిన ప్రభుత్వ డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు సదుపాయాలు అందుబాటులోకి వస్తే ఉప్పల్ నియోజకవర్గంతో పాటు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, అత్యవసర వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులను ఆదేశించి బ్లడ్ బ్యాంక్, డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, జెట్ట కిషోర్ కుమార్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- రైతులకు ట్రాన్స్ ఫార్మర్ల అందజేత

జయభేరి, దేవరకద్ర :



రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ అన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం దేవరకద్ర మున్సిపాలిటీ & మండలం కు చెందిన రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం 40 ట్రాన్స్ ఫార్మర్ లను మరియు ఏబి స్విచ్ లు, వైర్లు, పోల్స్ ను పంపిణీ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జియంఆర్ ప్రసంగించారు.రైతుల సంక్షేమమే ధ్యేయంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రస్తుతం వర్షాలు అంతంత మాత్రంగానే ఉండటంతో పలువురు రైతులు బోర్లపై ఆధారపడి వ్యవసాయం కొనసాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దేవరకద్ర నియోజకవర్గానికి సుమారు 800 ట్రాన్స్ ఫార్మర్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరగా ప్రభుత్వం వెంటనే స్పందించి 800 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా దేవరకద్ర మండలానికి మొదటి విడతలో 40 ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందజేస్తున్నామని, మరో పది రోజుల్లో మరో 60 ట్రాన్స్‌ఫార్మర్లను అందజేస్తామని తెలియజేశారు. ట్రాన్స్ఫార్మర్ల పంపిణీకి సంబంధించి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు అందజేస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు వైర్లు, ఏబీ స్విచ్ లు, పోల్స్ తదితర అవసరమైన విద్యుత్ సామగ్రిని రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో రైతుల అవసరాల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు 13 సబ్‌స్టేషన్ లకు శంకుస్థాపన చేసామని, దానికి సంబంధించిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి సంవత్సరంలోనే 500 ట్రాన్స్‌ఫార్మర్లను దేవరకద్ర నియోజకవర్గ రైతులకు అందజేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ట్రాన్స్ ఫార్మర్ల పంపిణీతో బస్వాయిపల్లి రైతుల ఆనందం

- ఎమ్మెల్యే జిఎంఆర్ కు గ్రామస్తుల కృతజ్ఞతలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాయపల్లి గ్రామానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ట్రాన్స్ ఫార్మర్లను పంపిణీ చేయడంతో ఆ గ్రామ రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు మంగళవారం ఎమ్మెల్యే జిఎంఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద దేవరకద్ర మున్సిపాలిటీ & మండల పరిధిలోని రైతులకు వ్యవసాయ అవసరాల కోసం 40 ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబి స్విచ్‌లు, వైర్లు, పోల్స్ పంపిణీ చేశారు. అందులో భాగంగానే బస్వాయపల్లి గ్రామానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ఈ ట్రాన్స్ ఫార్మర్లను అందజేశారు.రైతుల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించి పరిష్కారం చూపుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్ కు బస్వాయిపల్లి గ్రామ రైతులు యం. దామోదర్, వాకిటి లక్ష్మీనారాయణ రైతులు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.రైతు సంక్షేమమే లక్ష్యం రైతు సమస్యల పరిష్కారమే ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రధాన ధ్యేయం అని వారన్నారు. బస్వాయపల్లి గ్రామ రైతుల తరపున జిఎంఆర్ కు వారు ప్రత్యేక ధన్యవాదాలు.

## కేస్‌క్రాఫ్ట్‌లో పాలమూరు విద్యార్థిని గ్రీష్మ ప్రతిభ




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్‌నగర్ పట్టణంలోని (బీకే రెడ్డి కాలిని) కి చెందిన విద్యార్థిని గ్రీష్మ జాతీయ స్థాయి కార్పొరేట్ కేస్ స్టడీ పోటీలో సత్తా చాటింది. గ్రీష్మ బెంగళూరులోని ఐఐఎం ఎంబీఏ చదువుతోంది.దేశవ్యాప్తంగా బిజినెస్ స్కూల్ విద్యార్థుల కోసం డియాజియో ఇండియా నిర్వహించిన 'కేస్‌క్రాఫ్ట్' జాతీయ కేస్ స్టడీ పోటీలో 203 బృందాలు పాల్గొన్నాయి. అందులో విద్యార్థిని గ్రీష్మ బృందం జాతీయ స్థాయిలో రన్నరప్‌గా నిలిచింది.ప్రస్తుతం గ్రీష్మ ఐఐఎం బెంగళూరులో ఎంబీఏ చదువుతోంది. ముంబైలో జరిగిన తుది పోటీలో ఆమె మహెక్ చౌదరి, మాధవ్ గోయల్, వర్షిణి వెట్రివెల్ తో కలిసి బృందంగా పాల్గొన్నారు. వాస్తవ వ్యాపార సవాళ్లను విశ్లేషించి, వినూత్న వ్యాపార వ్యూహాలను ప్రతిపాదించడమే ఈ పోటీ ప్రధాన ఉద్దేశం. 203 బృందాల నుంచి పోటీపడి తుది దశకు చేరుకున్న గ్రీష్మ బృందం, తమ వ్యూహాత్మక ఆలోచనలు, విశ్లేషణతో జాతీయ రన్నరప్ గా నిలిచింది. ఈ సందర్భంగా బృందానికి రూ.1 లక్ష నగదు బహుమతి అందజేశారు. పట్టుదల, అంకితభావంతో పోటీలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల గ్రీష్మ తల్లిదండ్రులు కె. శంకర్, కె కవిత ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. దీంతో గ్రీష్మ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

## తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతికగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి



జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 18 :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఫరూఖ్‌నగర్: తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఫరూఖ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి, బహుజనుల ఆత్మగౌరవం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి. మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్. కొత్తూరు గోవర్ధన్ గౌడ్.తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు. గౌడ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల కరపత్రాలు, పోస్టర్లు విడుదల

జయభేరి, దేవరకద్ర :




తెలంగాణ రాష్ట్ర ఆటో మరియు యాప్ ఆధారిత జేఏసీ ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆటో కార్మికులకు కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల ఉద్యమంలో భాగంగా జిల్లా మున్సిపాలిటీ లో కొత్తగా నిర్మిస్తున్న భవనంలో మరియు ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో ఈ కరపత్రాలు,పోస్టర్లు విడుదల చేయడం చేశారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా జేఏసీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కే.రాము కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొని, ఆటో మరియు యాప్ ఆధారిత కార్మికుల సమస్యలను,న్యాయమైన డిమాండ్లపై పరిష్కరించాలని రాము డిమాండ్ చేశారు.ఆటో మరియు యాప్ ఆధారిత కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమానికి సంబంధించిన అన్ని న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 23న అర్ధరాత్రి నుంచి 24 వరకు ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాము కోరారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు జిల్లా కేంద్రానికి తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు.అదే విధంగా ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రతి ఆటో డ్రైవర్‌కు ఆయన పిలుపునిచ్చారు. ఆటో కార్మికుల జీవనోపాధిని కాపాడాలని ,ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కూడా ఆయన కోరారు.అన్ని యూనియన్లు ఐక్యంగా,సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాము కోరారు.

# కొనసాగుతున్న వాసవి మాత వార్షికోత్సవ మహోత్సవాలు

- సాంప్రదాయ రీతిలో పూజలు
- నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి 9వ వార్షికోత్సవ మహోత్సవాలు గత రెండు రోజులుగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉప్పలు పూజా కార్యక్రమాలను భక్తశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.ప్రతి ఏడాది అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవాలను నిర్వాహకులు అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవాలను ఆచారం ప్రకారం నిర్వహిస్తున్నారు. ఈనెల 19 వరకు ఈ మహోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ మహోత్సవాల సందర్భంగా అమ్మవారి సన్నిధిలో దేవస్థానం ప్రధాన అర్చకుడు తరిమాల హరిశంకర శర్మ, బ్రహ్మశ్రీ బద్రీనాథ్ శర్మల ఆధ్వర్యంలో శిల ధ్వజస్తంభ యంత్రస్థాపన మహోత్సవాన్ని నిర్వహించారు. అలాగే వేద పారాయణం, గోపూజ, దేవత అనుజ్ఞ, భూతబలి, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, రక్షా బంధనం, దీక్ష ధారణ, అఖండ దీప స్థాపన, నవకలశ స్థాపన, తీర్థ ప్రసాద వితరణ, మత్స్య గ్రహణం, అంకురార్పణం, ద్వాదశ పాత్ర ప్రయోగం, మూర్తి హోమం, ద్వాదశ రాగలాపన, జలాధివాసం కార్యక్రమాలను నిర్వహించారు.

వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం గవ్యాంత పూజలు, వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తుబలి, గ్రామ ప్రదిక్షణ, బింబశుద్ధి, మూర్తి హోమాలు, ధాన్యాధివాసం, కుంభ స్థాపన, కళా హోమాలు, పంచ శయ్యాది వాసం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో స్థానిక ఆర్యవైశ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విశేష మహోత్సవాల సందర్భంగా వాసవి మాత దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయ మానంగా అలంకరించారు. మామిడి తోరణాలు కట్టింపు కట్టి ముస్తాబు చేశారు. అమ్మవారిని కూడా వివిధ రకాల ఆభరణాలు, పూలతో అలంకరించారు.

### నేడు గవ్యాంత పూజలు

19న గవ్యాంత పూజలు, ధాతు న్యాసం, యంత్ర ప్రతిష్ఠ,శుభ ముహూర్తం, యంత్ర స్థాపన, నూతన ధ్వజస్తంభ స్థాపన, పూర్ణాహుతి, కళశోద్వాసన, కుంభాభిషేకం, కుంభ దర్శనం,గోదర్శనం, ప్రథమ దర్శనం, శాంతి కళ్యాణం, మహాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కావున ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, జిల్లా బిహెచ్పి మాజీ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణిల యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ లు కోరారు.

# క్షమాపణలు కాదు రాజీనామా చేయాలి

జయభేరి, హైదరాబాద్ :



సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు.భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22A లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కళ్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22A భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.



## ప్రజలకు వాస్తవాలు చెప్పాలి..!

- లాల్ కోట మైనార్టీ నాయకుడు మోయిన్

జయభేరి, దేవరకద్ర :

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కొనసాగుతున్న న్యాయస్థాన ప్రక్రియను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కుట్రగా చిత్రీకరించడం రాజకీయ దుష్ప్రచారం తప్ప మరొకటి కాదని లాల్‌కోట మైనార్టీ నాయకుడు మోయిన్ అన్నారు.కోర్టులో కేసు ఉన్నప్పుడు ప్రభుత్వం న్యాయస్థానానికి తన వాదనను సమర్థంగా వినిపించాల్సి ఉంటుంది. కోర్టు విచారణ, ఆదేశాలను రాజకీయ కోణంలో వక్రీకరించి పేద కుటుంబాల్లో ఆందోళన కలిగించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు కట్టుబడి ఉందని, లబ్ధిదారులకు ప్రయోజనం అందించే విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులకు నిజంగా పేద ఆడబిడ్డల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే.. కోర్టులో ఉన్న కేసు పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని, ప్రభుత్వం దాఖలు చేసే కౌంటర్ మరియు న్యాయపరమైన అంశాలపై ఆధారాలతో మాట్లాడాలని మోయిన్ సూచించారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలులో ఎదురైన సమస్యలపై కూడా బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రజలు స్వయంగా చూస్తున్నారన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రజల్లో మంచి గుర్తింపు పొందుతున్నారని, ఈ ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని మోయిన్ విమర్శించారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడకుండా ప్రతి అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం మానుకోవాలని, ప్రజలకు వాస్తవాలు చెప్పి ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు రావాలని సూచించారు. పేదల సంక్షేమం పేరుతో రాజకీయాలు కాదు.. ప్రజల కోసం నిజాయితీగా పనిచేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ నాయకత్వంలో ముందుకు సాగుతాం మోయిన్ అన్నారు.

## పథకాల మంజూరులో ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నాం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా ఉండాల్సిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని BRSV రాష్ట్ర ఉపాధ్యక్షులు వేములరాజు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. వివాహాల సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఈ పథకాలు కీలకం. కానీ అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి అన్నారు. ఎన్నికల హామీలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, అర్హులందరికీ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సహాయాన్ని వెంటనే విడుదల చేయాలి. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి నగదు జమ చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నాం. పేద ఆడపిల్లల వివాహాల కోసం రూపొందించిన ఈ పథకాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు. అర్హులందరికీ న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందని వేముల రాజు అన్నారు.

# షాద్ నగర్ లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

**జయభేరి, షాద్ నగర్ ఆగష్టు 18 :**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్, ఫీచర్ సిటీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ బి. శంకరయ్య మాట్లాడుతూ.... ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలంటే డ్రైవర్లు సమన్వయంతో వ్యవహరించి, ఒక పద్ధతి ప్రకారం వాహనాలను రోడ్డుపై నిలపాలని సూచించారు. డ్రైవర్లు తమ జీవనోపాధిపై దృష్టి సారిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని,సెల్‌ఫోన్ మాట్లాడుతూ లేదా ఇతర వైపులకు దృష్టి మళ్లిస్తూ డ్రైవింగ్ చేయకూడదని అన్నారు.ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని తెలిపారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్‌కు సంబంధించిన నూతన నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ తరచూ ఫైన్లు విధించబడితే, పాయింట్ల విధానం ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్‌పై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం వంటి వాటికి దూరంగా ఉండాలని సీఐ శంకరయ్య సూచించారు.

ఏసీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ,,ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. భారతదేశంలో ఏటా సుమారు 1.50 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, తెలంగాణలో కూడా ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారని తెలిపారు. వాహనం నడిపే సమయంలో డ్రైవర్ల పూర్తి దృష్టి రోడ్డుపైనే ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు






రహదారులపై గుంతలు, ఇంజనీరింగ్ లోపాలు, అతివేగం, సిగ్నల్ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలు ఉన్నప్పటికీ, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవర్ల నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు.

**డ్రైవర్లకు యూనిఫామ్ తప్పనిసరి**

డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని అధికారులు సూచించారు. యూనిఫామ్‌లో ఉన్నప్పుడే డ్రైవర్‌ను ప్రయాణికులు, పోలీసులు సులభంగా గుర్తించగలరని తెలిపారు. సివిల్ డ్రెస్‌లో ఉండి డ్రైవర్ అని చెప్పుకోవడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.పోలీసులు వాహనాలను తనిఖీ చేయడం ట్రాఫిక్ నిబంధనల్లో భాగమేనని, వ్యక్తిగత కారణాలతో ఎవరినీ ఆపరని స్పష్టం చేశారు. ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించకూడదని సూచించారు. ఒక చేతితో స్టీరింగ్ పట్టుకుని మరో చేతితో ఫోన్ మాట్లాడటం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.మనిషి ప్రాణం ఎంతో విలువైనది.. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శంకరయ్య, ఎస్సై వెంకటేష్, ఏఎస్ఐ ఆర్ రవీందర్, సిబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



## వర్షాల ఆధారంగా పంటల సాగుకు రైతులు సిద్ధం కావాలి

■ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 18:**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామ పంచాయితీ నందు ఎల్నినో వాతావరణ పరిస్థితుల పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి ఉమారాణి మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వర్షాధారల పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులు స్థానిక పరిస్థితులకు అనుకూలమైన వర్షాధార పంటలను ఎంపిక చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు అని అన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన రైతులు స్వల్ప కాలికంగా పండే ఉలువలు, పెసర్లు, మినుములు, నువ్వులు, జొన్న లు పండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిట్టా బాలకృష్ణ, కారోబార్ ఎరుకల స్వామి, రైతులు దేవరుప్పుల మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న పేరు వినగానే బీర్ల ఐలయ్యలో వణుకు

■ కొమ్మిరిశెట్టి నరసింహులు



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 18:**

తుర్కపల్లి: తీన్మార్ మల్లన్న పేరు వినగానే బీర్ల ఐలయ్యలో వణుకు పుడుతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మిరిశెట్టి నరసింహులు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తీన్మార్ మల్లన్న 60 నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేసి కృషి చేశారని నరసింహులు తెలిపారు. మల్లన్న ప్రచారం చేసిన 60 నియోజకవర్గాల్లో 40 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారని, వాటిలో ఆలేరు నియోజకవర్గం కూడా ఉందని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాదని బీర్ల ఐలయ్య చేసిన వ్యాఖ్యలు సరికావని ఆయన అన్నారు. 70 ఏళ్ల ఈశ్వరమ్మపై అగ్రకులాలకు చెందిన వారు అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలో, బీసీ బిడ్డగా ఉన్న బీర్ల ఐలయ్య కనీసం ఖండించలేకపోయారని విమర్శించారు. మల్లన్నపై బీర్ల ఐలయ్య చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాజకీయంగా చర్చ జరుగుతోందని నరసింహులు పేర్కొన్నారు. అయితే, సమావేశంలో చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలు కొమ్మిరిశెట్టి నరసింహులు వ్యక్తిగతంగా చేసినవేనని తెలిపారు. ఈ సమావేశంలో టీఆర్పీ జిల్లా కార్యదర్శి మోత్కుపల్లి రఘు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాంగల కిష్టయ్య, తుర్కపల్లి మండల అధ్యక్షుడు గోనె కృష్ణ, బొమ్మలరామారం మండల అధ్యక్షుడు బూడిద శ్రీనాథ్ గౌడ్, బొమ్మలరామారం మండల వర్కింగ్ ప్రెసిడెంట్, రైతు విభాగం మండల అధ్యక్షుడు గుండెబోయిన కృష్ణమూర్తి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు పనిగట్ల లక్ష్మణ్ గౌడ్, భూసాని వెంకటేష్, పనిగట్ల రాజా నరసయ్య, అశోక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



## లెక్చరర్ భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలి

■ సస్పెండ్ చేసి, ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి – విద్యార్థి సంఘాల డిమాండ్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న భాస్కర్ బాలికల పట్ల అసభ్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం BRSV, ABVP, SFI విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, విద్యార్థినుల భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న లెక్చరర్ భాస్కర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమని తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భాస్కర్‌పై సంబంధిత పోలీస్ కేసు నమోదు చేసి, విద్యార్థినులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కళాశాలలో విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని, ఈ ఘటనపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ,ABVP నాయకులు గోపీచంద్,SFI డివిజన్ అధ్యక్షులు బుడిగ వెంకటేష్,ముదిగొండ హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిరు కుటుంబానికి ఆర్థిక సహాయం



**జయభేరి, నేరడుగొమ్ము :**

నేరేడు గోమ్ము మండలం చిన్నమునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ చిరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని BRS రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ అన్నారు. మంగళవారం స్వగ్రామం లో చిరు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....చిరు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిరు కుటుంబానికి 10,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట జీవన్ భగత్, కేతావత్ మంజ్య నాయక్, కేతావత్ డాక్యా, కేతావత్ హరిలాల్ నాయక్, కేతావత్ నాగు నాయక్, సోమా నాయక్, కేతావత్ చంటి, బిచ్చు, బిక్యా నాయక్ తదితరులు ఉన్నారు.

# కోయిల్ సాగర్ రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి

■ దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ సూచన

■ కోయిల్ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి విడుదలపై ఇరిగేషన్ అధికారులు, రైతులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం




**జయభేరి, దేవరకద్ర :**

దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్ సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల అంశంపై ఇరిగేషన్ అధికారులు, రైతులతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమీక్ష సమావేశాన్ని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయకట్టు పరిస్థితులు, రిజర్వాయర్‌లోని నీటి లభ్యత, చెరువుల నింపుదల, భూగర్భ జలాల రీచార్జ్ తదితర అంశాలపై అధికారులతో, రైతులతో ఎమ్మెల్యే గారు చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ గారు మాట్లాడుతూ.. కోయిల్ సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.9 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, ఇందులో తాగునీటి అవసరాల కోసం 0.6 టీఎంసీల నీటిని కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు.ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపడంతో పాటు బోర్లు రీచార్జ్ అయ్యేలా మొదటి విడతగా ఏడు రోజుల పాటు కాలువల ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే గారు తెలిపారు. సాధారణంగా కాలువలకు నీటిని విడుదల చేయాలంటే రిజర్వాయర్‌లో కనీసం 1.5 టీఎంసీల నీరు ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని బోర్ల రీఛార్జ్, చెరువుల నింపుదలకు నీటిని విడుదల చేస్తున్నామని తెలియజేశారు.నీళ్లు వస్తున్నాయనే ఉద్దేశంతో రైతులు కొత్తగా తుకాలు వేయవద్దని విజ్ఞప్తి చేశారు, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆరుతడి పంటల వైపే రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే జిఎంఆర్ రైతులకు సూచించారు.అదేవిధంగా ప్రస్తుతం ఉంద్యాల పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా కోయిల్ సాగర్‌కు నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల తర్వాత రిజర్వాయర్‌లో నీటి మట్టం ఎంతమేర పెరిగిందో పరిశీలించి, అందుబాటులో ఉన్న నీటి ఆధారంగా సాధ్యమైనంత మేర రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే జియంఆర్ గారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు రైతులు, ప్రాజెక్టుర్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల తదితరులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం

■ షాద్‌నగర్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు




**జయభేరి, షాద్‌నగర్, ఆగస్టు 18 :**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం, ఆయన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజం కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, నక్కల వెంకటేష్ గౌడ్, కె. చంద్రశేఖర్ గౌడ్, మాజీ లైబ్రరీ చైర్మన్ లక్ష్మీనరసింహా రెడ్డి, కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, శారద శేఖర్, వాణి పాందురంగారెడ్డి, గోపాల్, ఎస్పీ శివ, పట్టణ అధ్యక్షులు నటరాజన్, మాజీ కౌన్సిలర్లు కానుగు అంతయ్య, శ్రీనివాస్ గౌడ్, జూపల్లి శంకర్, చిన్న యాదగిరి, మాజీ సర్పంచులు రంగయ్య గౌడ్, ఆంజనేయులు గౌడ్, జి టి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు వెంకటేష్ గౌడ్, రవి గౌడ్, వడ్డె బాలయ్య, గౌడ సంఘం నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలి

■ సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగినాయి. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ జయంతి ఉత్సవాల్లో బిసి, ఎస్సి ,ఎస్టి ,మైనార్టీ సంఘం నాయకులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు. ఈ జయంతి ఉత్సవాల్లో వివిధ రంగాల్లో రానిచ్చినటువంటి సామాజిక కార్యకర్తలు ,మహిళలు ,మేధావులు, కార్మిక, కర్షకులను ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం పోరాడాలని, సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తూ, ఆయన తాటి చెట్టు పై చేయి వేయడం కాదు కొడితే గోల్కొండ ఖిల్లా అనే కొట్టాలి అని పిలుపునిచ్చి భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో తొలి స్వాతంత్ర ఉద్యమకారుడుగా, తొలి బహుజన సామ్రాజ్యాన్నీ స్థాపించిన గొప్ప నాయకుడని కొనియాడారు .గోల్కొండ తో పాటు 18 దుర్గాలకు రాజుగా పాలించిన బహుజన చక్రవర్తి అని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, చోల్లేటిభాస్కరాచారి, డాక్టర్ ఏకుల రాజారావు, ఉప్పల శీను నేత, దబ్బీకార్ పెంటోజి,ఏరుకొండల రాము, మునగాల గణేష్,పున్న బిక్షమయ్య ,ముక్కామల బాలయ్య, శవ్వ నారాయణయాదవ్ ,పోతాం సహదేవ్, కుంభం బాలచందర్ గౌడ్ ,ఇంద్రకంటి ఈదయ్య గౌడ్, నాగిళ్ల క్రిష్టఫర్, బోయపల్లి చంద్రమౌళి ,ఏకులz సురేష్, ఎండి అబ్దుల్ సత్తార్, అబ్దుల్ కలాం, తోటపల్లి శీను, రాచమల్ల నాగయ్య, కానుగుల చంద్రశేఖర్, కాటం గోవర్ధన్ ,ఎరుకల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## విజయ్ జువేళర్స్ మొదటి వార్షికోత్సవ వేడుకలు

■ ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 18 :**

షాద్ నగర్ పట్టణంలో శివాజీ చౌక్ దగ్గర విజయ్ ఆచార్య,మరియు సుకుమార్ ఏర్పాటు చేసిన విజయ్ జువేళర్స్ మొదటి వార్షికోత్సవ వేడుకలకు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మొదటి వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన బంగారు,వెండి ఆభరణాలను అందిస్తూ విజయవంతంగా మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్నందుకు విజయ్ జ్యువెలర్స్ యజమానులను,ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఈ సంస్థ మరిన్ని శాఖలతో విస్తరించి,కస్టమర్ల నమ్మకాన్ని చూరగొంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ అనిత రఘునాథ్ యాదవ్, వాణి పాండురంగ రెడ్డి,అశోక్ యాదవ్,మాజీ కౌన్సిలర్లు యుగేందర్, చిన్న యాదగిరి,చెన్నయ్య,కాంటెస్టెడ్ కౌన్సిలర్ సలీం,మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,మామిడిపల్లి మాజీ ఎంపిటిసి కాట్న రవీందర్,మొదల్లగూడ మాజీ సర్పంచ్ నాగర్ కుంట ఉమా ప్రవీణ్ రెడ్డి మరియు బీఆర్ఎస్ నాయకులు రఘుపతి రెడ్డి,అశ్రవ్,రమేష్ గౌడ్,వెంకట్ రెడ్డి,క్రిష్ణ గౌడ్,దినేష్ సాగర్,శివా చారి,నర్సింగ్,అఖిబ్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ పట్టణంలో అగ్నిప్రమాదం

**జయభేరి, మెదక్ :**

నర్సాపూర్-సంగారెడ్డి రహదారి పక్కన మాతాజీ హార్డ్వేర్ గోదాంలో మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్తో మంటలు ఒక్కసారిగా అంటుకున్నాయి. గోదాం నుంచి పొగలు దట్టంగా వ్యాపించాయి. అత్తమైన స్థానికులు.. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

# రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించాలి

- ఎడీఏ వెంకట్‌రాంరెడ్డి
- ఘనాపూర్‌లో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన
- నానో ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, సబ్సిడీలపై సూచనలు

**జయభేరి, మేడ్చల్ :**

రైతులు సంప్రదాయ సాగు పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఎడీఏ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనాపూర్ గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (CATMA) ఆధ్వర్యంలో రైతులకు RPL శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగం, నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు




వివరించారు. ముఖ్యంగా కూరగాయల సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. అలాగే రైతులకు అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, తక్కువ పెట్టుబడితో అధిక ప్రయోజనాలు పొందే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎడీఏ వెంకట్‌రాం రెడ్డి మాట్లాడుతూ రైతులు సంప్రదాయ సాగు పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి నూతన ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో, సిఫార్సు చేసిన మోతాదులో వినియోగించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుని పంట దిగుబడిని పెంచుకోవచ్చన్నారు. నాణ్యమైన విత్తనాల ఎంపికతో పాటు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కూరగాయల సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శిక్షణ కార్యక్రమాలను నిరంతరం అందిస్తున్నామని తెలిపారు. రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని ఎడీఏ వెంకట్‌రాంరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి, కౌన్సిలర్ నునావత్ పార్వతి, ఏఓ కృష్ణవేణి, హెచ్‌ఓ వెంకటరమణ, ఏఈఓ తేజస్విని, హెచ్‌ఈఓ సారిక, రైతులు, కోరమాండల్ కంపెనీ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 18:**

యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంలోని గౌడ సంఘం దగ్గర పలువురు గౌడ సంఘం నేతలు,వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యాదగిరిగుట్ట మండల పరిధిలోని మాసాయిపేట గౌరాయపల్లి,వంగపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి గౌడ సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అణచివేతపై తిరుగుబాటు చేసి,సామాజిక సమత, సార్వభౌమత్వ సాధన కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బహుజనుల హక్కుల సాధనకు,సామాజిక పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు,పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల తొలగింపుపైన బీఆర్ఎస్ ధర్నా


- పార్టీ నేతలు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి ఆగ్రహం



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగష్టు 18 :**

యాదగిరిగుట్టలో బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీల తొలగింపు వివాదంగా మారింది. యాదగిరిగుట్ట పట్టణ మున్సిపల్ సిబ్బంది బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకల ఫ్లెక్సీలు తొలగించారని దగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయం ఆ పార్టీ నాయకులు చుట్టు ముట్టారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి 16వ తేదీన జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన యాదగిరిగుట్ట పట్టణములోని ఫ్లెక్సీలు అన్ని మున్సిపల్ సిబ్బందితో తీసేయించారు అని, గతంలో కూడా ఇలానే చేశారు. అని కాంగ్రెస్ పార్టీ లీడర్ల ఫ్లెక్సీలు మాత్రం ఇప్పటికే ఉన్నాయని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా ధర్నా చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి, కౌడే మహేందర్, తొటకూరి బీరయ్య, మిట్ట వెంకటయ్య, ర్యాకల రాజు, మాటూరి బాలయ్య, సతీష్ బట్ , ఒగ్గు మల్లేష్,నరసింహారెడ్డి,రాజేష్, క్రాంతి,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లు,షాపులలో ఆకస్మికంగా తనిఖీలు




**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 18 :**

యాదగిరిగుట్ట పట్టణంలోని పలు హోటళ్లు,దుకాణాలలో మున్సిపల్ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం తనిఖీల అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రతి ఒక్క షాపు యజమాని ట్రేడ్ లైసెన్స్ కచ్చితంగా తీసుకోవాలన్నారు. ఇప్పటికే లైసెన్స్ తీసుకున్న వారు సకాలంలో రెన్యూవల్ చేయించాలని,ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటళ్ల నిర్వాహకులు పరిశుభ్రతను పాటించాలని,ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రతి షాపు నిర్వాహకుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 18 :**

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ సూచించారు. యాదగిరిగుట్ట మండలంలోని జంగంపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్, కంప్యూటర్, ఇంటర్నెట్, సోషల్ మీడియా,ఆన్లైన్ బ్యాంకింగ్ ద్వారా సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతాయని వివరించారు. తెలియని వ్యక్తులు పంపించే లింక్‌లకు క్లిక్ చేయొద్దని, ఇతరులకు ఓటీపీ, పిన్ నెంబర్, సీవీవీ లాంటివి ఇవ్వొద్దని తెలిపారు. అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయొద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం,ఫొటోలు, బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని తెలిపారు. కేవైసీ, ఆఫర్ల వంటి ప్రకటనపై జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రసాద్,ఖాజా మొయినుద్దీన్‌తో పాటు పోలీసు సిబ్బంది,జంగపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు మట్టి కుండలోనే బోనం సమర్పించాలి

- మట్టి కుండలో బోనం తీయడం ఆచారం మాత్రమే కాదు ఆరోగ్యం -రుచి -భక్తి మూడు కలిపి ఉంటాయి
- కుమ్మరి శాలివాహన సంఘం కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు ఏరుకొండ రాము

**జయభేరి, కొండమల్లేపల్లి :**

ప్రస్తుత శ్రావణమాసంలో భక్తులు గ్రామాలలో గ్రామ దేవతలకు ,అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఈ సమయంలో బోనాలు మట్టి పాత్రలోనే తీయాలని కొండమల్లేపల్లి మండల కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షులు ఏరుకొండ రాము అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి పాత్రలో బోనం అంటే ఆచారం మాత్రమే కాదని ఆరోగ్యం రుచి భక్తి కలిగి ఉన్నది అని మట్టి పాత్ర గొప్పతనాన్ని తెలియజేశారు. తెలంగాణ సంప్రదాయంలో బోనాల పండుగలో మట్టి కుండకే చాలా ప్రత్యేకత ఉందని. అమ్మవారికి,గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించడానికి మట్టి కుండనే ఎక్కువగా వాడతారు అని ఆయన అన్నారు. మట్టి కుండలో వండిన అన్నం, పాలు, బెల్లం ఎక్కువసేపు చల్లగా ఉంటాయని. వేడికి తట్టుకొని నెమ్మదిగా ఉడుకుతుంది కాబట్టి పోషకాలు నశించవు అని



తెలిపారు. మట్టిలో సహజంగా క్షార గుణం ఉంటుందని దీనివల్ల ఆమ్లత్వం తగ్గి అన్నం తేలికగా జీర్ణమవుతుందని ఆయన అన్నారు. కుండ నుండి కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ వంటి సూక్ష్మపోషకాలు ఆహారంలోకి కలుస్తాయని తెలియజేశారు. కెమికల్ రహితంగా ఉండడం వల్ల అమ్మవారికి స్వచ్ఛమైన నైవేద్యం అవుతుంది దీంతో అమ్మవారి అనుగ్రహం పొందవచ్చు అన్నారు. మట్టి కుండలో ఉడికించడం వల్ల బోనానికి ఒక ప్రత్యేకమైన మట్టి వాసన, రుచి వస్తుందని, అదే అసలైన రుచికరమైన బోనం అన్నారు. మట్టి కుండలో ఆహార పదార్థాలు ఉడికించేటప్పుడు వేడి సమానంగా పంపిణీ అవుతుందని, అందుకే అన్నం, పాలు మాడకుండా చిక్కగా వస్తాయి అన్నారు. భక్తుల నమ్మకం ప్రకారం మట్టి కుండలో సమర్పించిన బోనాన్ని అమ్మవారు త్వరగా స్వీకరిస్తుందని, కోరికలు తీరుస్తాయని తరతరాలుగా నమ్మకం ఉంది అన్నారు. మట్టి సహజమైనది, పవిత్రమైనది. అందుకే దేవతా పూజల్లో మట్టి కుండకే మొదటి స్థానం ఉందని ఆయన గర్వంగా కలిపారు. ఒకసారి వాడిన కుండను నిమజ్జనం చేయడం వల్ల భూమిలో కలిసిపోతుందని ఎలాంటి కాలుష్యం ఏర్పడదని సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా బోనం ఊరేగింపులో ప్రతి ఇంటి నుండి మట్టి కుండలో బోనం తీసుకురావడం వల్ల ఊరంతా ఒకే కుటుంబంలా కనుల పండగగా కనిపిస్తుందన్నారు. పూర్వం ప్రజలందరూ వంటలకు మట్టి పాత్రలనే వాడేవారని నీటిని నిలువ చేయడానికి,తినే పాత్రలను సహితం మట్టి పాత్రలనే వాడేవారు అని అందుకే వారు వంద సంవత్సరాలకు పైగా ఆరోగ్యంగా జీవించారని అన్నారు. ఇప్పుడు ప్లాస్టిక్ తదితర పాత్రలలో ఆహార పదార్థాలు నిలువ చేయడం వంట చేయడం తినడం చేస్తుండడం వలన ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ఇప్పటికైనా ప్రజలు గ్రహించి సంప్రదాయం తో పాటు ఆరోగ్యం కూడా దాగి ఉన్న మట్టి పాత్రలనే వాడాలని ఆయన సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- డిప్యూటీ కమిషనర్ సుధాంష్
- పూడూర్-కిష్టాపూర్ వార్డులో డిప్యూటీ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన

**జయభేరి, మేడ్చల్:**

ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంష్ తెలిపారు. మంగళవారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూర్-కిష్టాపూర్ వార్డులో డిప్యూటీ కమిషనర్ సుధాంష్ క్షేత్రస్థాయిలో పర్యటించి, వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి అవసరాలను పరిశీలించారు. ఉదయం టీచర్స్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, బ్రాడ్‌వే కాలనీ, హైటెక్ స్కూల్ రోడ్, అథ్వెల్లి గ్రామం, శాంతా బయోటెక్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్ల పరిస్థితి, వీధి దీపాలు, పార్కులు, శ్మశానవాటిక, కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్ తదితర మౌలిక వసతులను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడిన డిప్యూటీ కమిషనర్ వారి సమస్యలు, అవస



రాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ సుధాంష్ మాట్లాడుతూ వార్డు పరిధిలోని సమస్యలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజల అవసరాలను తెలుసుకునేందుకే ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు.

రోడ్లు, వీధి దీపాలు, పార్కులు, కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజలు నేరుగా తెలియజేసిన సమస్యలను నమోదు చేసుకుని, అత్యవసర అంశాలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వార్డులో పారిశుధ్యం, మౌలిక వసతుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ జకట దేవా, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శేఖర్ గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం..

- క్షేత్రస్థాయిలో ఎంపీ ఈటల రాజేందర్ పర్యటన

**జయభేరి, మేడ్చల్:**


ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లలో కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపడుతున్న రైల్వే అభివృద్ధి పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి మేడ్చల్, గౌడవెల్లి, గుండ్ల పోచంపల్లి, బొల్లారం, తుర్కపల్లి, జనప్రియ, నేరేడ్‌మెట్ ప్రాంతాల్లో ఎంపీ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలపై ఎంపీ దృష్టి సారించారు.

నిర్మాణంలో ఉన్న ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అనంతరం అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరణ పనులు కొనసాగుతున్న మేడ్చల్ రైల్వే స్టేషన్‌ను ఈటల రాజేందర్ పరిశీలించారు. ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్టేషన్ అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులకు సూచించారు. నియోజకవర్గ ప్రజల రవాణా కష్టాలను తొలగించడమే తన ప్రధాన లక్ష్యమని ఈటల రాజేందర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు త్వరగా అందేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## పూడూరులో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూరు-కిష్టాపూర్ డివిజన్‌లో పూడూరు గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం నాయకులు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సృజన,డిప్యూటీ కమిషనర్ సుధాంశుకు నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పూడూరు గ్రామంలోని అన్ని రోడ్లకు నిధులు మంజూరైనట్లు వారు పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు కృషి ఎల్లప్పుడూ కొనసాగుతుందని నాయకులు తెలిపారు.ముఖ్యంగా సీసీ రోడ్లు,డ్రైనేజీలు ,స్ట్రీట్ లైట్లు తదితర సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి,కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సింగరేణి పోచయ్య, మాజీ సర్పంచ్ బాబు యాదవ్,మాజీ సొసైటీ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ నీరుడి రఘు,మాజీ ఉప సర్పంచ్ మానేపల్లి వెంకటేష్,మాజీ వార్డు సభ్యులు హన్మంత్ రెడ్డి,శేషికుమార్,పుట్నాల శ్రీకాంత్,గ్రామస్తులు తుపాకుల తిరుపతి,బక్క నాగరాజు,బక్క శేఖర్,గడ్డం బాబు,శ్రీశైలం యాదవ్, తుపాకుల ప్రభాకర్,డప్పు బిక్షపతి,మజ్జిగ శంకర్ రెడ్డి,కుంట రంగారెడ్డి,నీరుడి సుధాకర్,ఏర్పుల మహేష్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాల వెంకటయ్య కుటుంబాన్ని ఆర్థిక సహాయం



**జయభేరి, నేరేడు గోమ్ము :**

నేరేడు గోమ్ము మండలం కొత్తపల్లి గ్రామంలో గత వారం రోజుల కింద అనారోగ్యం తో మరణించిన వనం వెంకటయ్య (సాల వెంకటయ్య ) కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ పద్మ హన్మనాయక్ మరియు కేతావత్ పుల్సింగ్ వారి కుటుంబానికి ఆర్థిక సహాయం 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది వారి వెంట కాసాని ఈదయ్య నల్గొండ పాండయ్య గన్నయ్య యాదగిరి బీరయ్య కోటయ్య గడ్డం రమేష్ నాగరాజు హరికృష్ణ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత

- వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందిందని బంధువులఆందోళన



**జయభేరి, హైదరాబాద్ :**

అత్తాపూర్ పిస్ పరిధిలోని జాయ్ హాస్పిటల్ వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జ్వరం అని హాస్పిటల్లో చేరిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందడంతో, వైద్యుల నిర్లక్ష్యమేకారణమంటూ మృతురాలి ధువులుఆసుపత్రి ముందు భారీగా చేరుకునిఆందోళనకు దిగారు. స్థానికంగా ఉండే శ్రీలత (28) అనే మహిళకు నిన్న జ్వరం రాగా కుటుంబ సభ్యులు ఆమెను అత్తాపూర్, సమీపలోనిజాయ్, హాస్పిటల్లోచేర్పించారు. నిన్నటి నుంచిచికిత్స అందిస్తున్నామని చెప్పిన ఆసుపత్రి యాజమాన్యం, రాత్రి సమయానికి పరిస్థితి విషమంగా ఉందంటూ ఐసీయూ (ICU)కి తరలించారు. ఆ తర్వాత శ్రీలత మృతి చెందినట్లు ప్రకటించడంతో బంధువులు షాక్కు గురయ్యారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపంచారు.



# వేరొకరి ఇయర్ బడ్స్ వాడుతున్నారా.?

**ఇది తెలిస్తే ఇంకోసారి ఆ జోలికి వెళ్లరు..**

నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరి వద్ద బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ కచ్చితంగా ఉంటున్నాయి. ప్రయాణాల్లో ఉన్నప్పుడైనా, ఆఫీసుల్లో పనిచేస్తున్నప్పుడైనా పాటలు వినడానికి లేదా ఫోన్ మాట్లాడటానికి ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉపయోగపడతాయి. అయితే, చాలామంది తమ ఇయర్ బడ్స్ అందుబాటులో లేనప్పుడు లేదా స్నేహితులు పంపిన ఏదైనా ఆడియో వినడానికి వారి ఇయర్ బడ్స్‌ను మార్చుకుని వాడుతుంటారు. ఇలా ఇతరుల బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ వాడటం అనేది అత్యంత ప్రమాదకరమని, ఇది నేరుగా చెవి ఇన్ఫెక్షన్లను కొనితెచ్చుకోవడమేనని వైద్యులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒకరి ఇయర్ బడ్స్‌ను మరొకరు పంచుకోవడం అనేది తీవ్రమైన అపరిశుభ్రమైన అలవాటు. ఇది ఎంత అసహ్యకరమైన అలవాటంటే, వేరొకరు వేసుకుని చెమట పట్టిన సాక్సులను మనం వేసుకోవడం కంటే కూడా ఘోరమైనదని వైద్యులు పోల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతి ఒక్కరి చెవి లోపలి భాగంలో కొంత శాతం సహజమైన బ్యాక్టీరియా, వ్యాక్స్, ఫంగస్ ఉంటాయి. ఇవి ఆయా వ్యక్తుల శరీర తత్వానికి అనుగుణంగా ఉంటాయి. అయితే, మనం ఇతరుల ఇయర్ బడ్స్‌ను మన చెవిలో పెట్టుకున్నప్పుడు, వారి చెవిలో ఉండే ఆ ప్రమాదకరమైన బ్యాక్టీరియా, ఫంగస్ కణాలు ఆ ఇయర్ బడ్స్ ద్వారా నేరుగా మన చెవిలోకి ప్రవేశిస్తాయి.

ఇలా ఇతరుల బ్యాక్టీరియా మన చెవిలో చేరడం వల్ల చెవి లోపలి భాగంలో తీవ్రమైన అలర్జీలు, ఇన్ఫెక్షన్లు దారితీస్తాయి. దీనివల్ల చెవిలో భరించలేనంత తీవ్రమైన దురద, విపరీతమైన నొప్పి, చెవిలో నుంచి పసుపు రంగు ద్రవాలు కారడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. సమస్య మరింత తీవ్రమైతే అది వినికిడి లోపానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు. అందుకే పర్సనల్ హైజీన్లో భాగంగా ఇయర్ బడ్స్ అనేవి కేవలం మీ వ్యక్తిగత అవసరాలకు మాత్రమే పరిమితం కావాలి. 'మీ ఇయర్ బడ్స్‌ను ఎవరికీ ఇవ్వకండి, ఇతరులవి మీరు అస్సలు వాడకండి' అని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వేరొకరిది వాడాల్సి వచ్చినా లేదా మీ ఇయర్ బడ్స్‌ని ఇతరులు వాడినా.. వాటిని తిరిగి ఉపయోగించే ముందు శానిటైజర్ లిక్విడ్ లేదా ఆల్కహాల్ వైప్స్‌తో పూర్తిగా క్లీన్ చేసిన తర్వాతే వాడటం సురక్షితం.



# ఫుల్ ప్రొటీన్ తో అందరికి నచ్చే ఎనర్జీ డ్రింక్..

**రోజూ ఉదయాన్నే తీసుకున్నారంటే తిరుగులేని ఆరోగ్యం మీ సొంతం!**

ఇటీవలి కాలంలో మఖానా ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు, వాటిని ఎలా తీసుకోవాలో ఇప్పుడు తప్పక తెలుసుకోవాలి.

నేటి కాలంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి రకరకాల ఆహారాలు తింటారు. కొందరు తమ ఆహారంలో మఖానాను కూడా చేర్చుకుంటారు. ఇటీవలి కాలంలో మఖానా..తామర గింజలు లేదా ఫాక్స్ నట్స్ అనేది ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. ఆరోగ్యానికి పోషకమైన మఖానా, సహజంగా శరీరాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. అందుకే మఖానాను పోషకాల గనిగా పరిగణిస్తారు. మఖానా తినడం వల్ల బలహీనమైన ఎముకలకు శక్తి లభిస్తుంది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

**ఎముకలు, కండరాల బలం:**

మఖానా, పాలు రెండింటిలోనూ కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలను, పళ్ళను దృఢంగా ఉంచడమే కాకుండా ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే, ఇందులోని హైప్రోటీన్ కండరాల పెరుగుదలకు, కణజాలాల మరమ్మత్తుకు ఎంతగానో తోడ్పడుతుంది.

**రోగనిరోధక శక్తి పెరుగుతుంది:**

మఖానాలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి పాలలోని అవసరమైన విటమిన్లు, ఖనిజాలతో కలిసి శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీనివల్ల సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా శరీరం సురక్షితంగా ఉంటుంది.

**గుండె ఆరోగ్యానికి మేలు:**

మఖానాలో కొలెస్ట్రాల్, సోడియం శాతాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇది రక్తపోటును (బిపి) అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. పాలతో కలిసి ఇది గుండె పనితీరును మెరుగుపరిచి, గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుంది.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**

మఖానాలో ఉండే పీచు పదార్థం (ఫైబర్) మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. పాలు జీర్ణవ్యవస్థను ప్రశాంతంగా ఉంచి, ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తాయి. ఇది శరీర మెటబాలిజంను కూడా పెంచుతుంది.

**బరువు తగ్గడానికి, చర్మ సౌందర్యానికి:**

ఈ ఆహారం తిన్న తర్వాత ఎక్కువ సమయం ఆకలి వేయకుండా కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన క్రేవింగ్స్ తగ్గి, బరువు సులభంగా అదుపులోకి వస్తుంది. అలాగే, మఖానాలోని యాంటీ ఏజింగ్ గుణాలు, పాలలోని హైడ్రేటింగ్ గుణాలు కలిసి ముడతలను తగ్గించి, చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుతాయి.

**కిడ్నీల ఆరోగ్యానికి రక్షణ:**

మఖానా సహజ డిటాక్సిఫైయర్‌గా పనిచేసి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంది. పాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతూ, మూత్రపిండాలు (కిడ్నీలు) ఆరోగ్యంగా పనిచేసేలా చేస్తాయి. పోషకాల గని అయిన ఈ నానబెట్టిన మఖానాను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు.



# నిద్రలేచిన తర్వాత ఎలా గడపాలో తెలుసా?

**హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్‌కు చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ ఏం చెబుతున్నారంటే.. ఉదయం వేళల్లో కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా శరీరంలోని సిర్కాడియన్ రిథమ్‌ను సమతుల్యం చేసుకోవచ్చు. దీంతో శరీరం సహజమైన శక్తిని పొందడమే కాకుండా, మెరుగైన నిద్ర కూడా లభిస్తుంది.**

**ఉదయాన్నే సూర్యరశ్మిని ఆస్వాదించండి**

నిద్రలేచిన 30 నుంచి 60 నిమిషాలలోపు కనీసం 10 నుంచి 20 నిమిషాల పాటు సహజ సూర్యకాంతిలో గడపాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరంలో కార్టిసాల్ హార్మోన్ సమతుల్యంగా విడుదల కావడానికి సహాయపడుతుంది. ఫలితంగా రోజంతా ఉత్సాహంగా, చురుకుగా ఉండగలుగుతారు.

**నిద్రలేవగానే కాఫీకి దూరంగా ఉండండి**

చాలామంది నిద్రలేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు కలిగి ఉంటారు. అయితే శరీరం సహజంగా మేల్కొనే ప్రక్రియకు సమయం ఇవ్వడం అవసరం. అందుకే కనీసం 60 నుంచి 90 నిమిషాల తర్వాత కాఫీ లేదా టీ తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

**ముందుగా నీళ్లు తాగండి**

రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరంలో కొంత మేర నీటి లోపం ఏర్పడుతుంది. అందువల్ల ఉదయం లేవగానే సుమారు 500 మిల్లీలీటర్ల నీరు తాగడం ద్వారా శరీరానికి తేమను అందించవచ్చు. ఇది జీవక్రియలను చురుకుగా చేయడంలో కూడా సహాయపడుతుంది.

**తేలికపాటి వ్యాయామం చేయండి**

ఉదయం కొద్దిసేపు నడవడం, ఒళ్ళు విరుచుకోవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్ చేయడం ద్వారా శరీరం చురుకుదనాన్ని పొందుతుంది. ఇది మెదడుకు రోజు ప్రారంభమైందనే సంకేతాన్ని పంపి ఏకాగ్రత, శక్తిని పెంచుతుంది. నిద్రలేవగానే సోషల్ మీడియా, మెసేజ్‌లు లేదా ఈమెయిల్స్ చూడడం వల్ల ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఉదయం మొదటి గంటలో మొబైల్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం మంచిది.

**స్నూజ్ బటన్ నొక్కకండి**

అలారం మోగిన ప్రతిసారి స్నూజ్ బటన్ నొక్కడం వల్ల మెదడు మళ్లీ నిద్రలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుంది. దీంతో అలసట, నీరసం పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి అలారం మోగగానే లేవడం ఉత్తమం.

**పోషకాలు ఉన్న అల్పాహారం తీసుకోండి**

ఉదయం అల్పాహారం రోజంతా శక్తిని అందించే ముఖ్యమైన భోజనం. అధిక చక్కెర కలిగిన ఆహారాలకు బదులుగా ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది.

**ఆరోగ్యకరమైన ఉదయమే ఆరోగ్యకరమైన రోజుకు పునాది**

ఉదయం వేళల్లో ఈ సాధారణ అలవాట్లను పాటించడం ద్వారా శరీర ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, మంచి నిద్ర కూడా పొందవచ్చు. చిన్న మార్పులతో పెద్ద ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రోజును ఆరోగ్యకరమైన ఉదయంతో ప్రారంభించడం అవసరం.





# అలా చేస్తే కెరీర్ వేరేలా ఉండేది..

'డాక్టర్ కావాలనుకొని యాక్టర్ అయ్యాను' అని చాలామంది హీరోయిన్లు చెబుతుంటారు. సాయిపల్లవి, శ్రీలీల లాంటి హీరోయిన్లయితే.. డాక్టర్ చదివి కూడా యాక్టర్లయిపోయారు. మలయాళ మందారం ఐశ్వర్య లక్ష్మి కూడా వారి దారిలోనే డాక్టర్ చదివి యాక్టరై విజయాలను అందుకుంటున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'అనుకున్నది జరక్కపోవడమే జీవితం. నన్ను డాక్టర్‌గా చూడాలని మా అమ్మానాన్నల కోరిక. నేను కూడా కష్టపడి హౌస్ సర్జన్ చేశాను. ప్రాక్టీస్ మొదలుపెడితే నా కెరీర్ వేరేలా ఉండేదేమో. కానీ నేను అనుకోకుండా మోడలింగ్ వైపు మళ్లాను. తర్వాత సినిమా పిలిచింది. తొలినాళ్లలో అమ్మానాన్నకు నా ప్రవర్తన మింగుడు పడలేదు. విజయాలు రావడం, నా నటనను అంతా మెచ్చుకోవడం.. ఇవన్నీ చూసి వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు' అంటూ ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చింది. సాయిదుర్గతేజ్‌కు జోడీగా ఆమె నటించిన 'సంబరాల ఏటిగట్టు' సినిమా త్వరలోనే విడుదల కానున్నది.



# ఓటీటీలోకి దళపతి విజయ్ 'జన నాయగన్'

కోలీవుడ్ స్టార్ హీరో, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు') డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ పొలిటికల్ థ్రిల్లర్ సినిమా త్వరలోనే ఓటీటీ ప్రేక్షకులను అలరించనుంది. సెన్సార్ సమస్యలు మరియు వివిధ కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎట్టకేలకు జూలై 23న థియేటర్లలో విడుదలైంది. థియేట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ మూవీని ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్ జీ5 (ZEE5) సంస్థ అధికారికంగా ఓటీటీలోకి తీసుకువస్తోంది. ఆగస్టు 21వ తేదీ నుంచి ఈ సినిమా జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక వెల్లడించారు మేకర్స్. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ భాషలలో ఒకేసారి ఈ డిజిటల్ ప్రీమియర్ అందుబాటులోకి రానుంది. అయితే, హిందీ వెర్షన్ మాత్రం కొద్ది వారాల తర్వాత స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే, మమిత బైజు, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విజయ్ కెరీర్‌లో చివరి సినిమా కావడంతో పాటు థియేటర్లలో ఈ చిత్రాన్ని మిస్సయిన అభిమానులు ఓటీటీలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


# శరవేగంగా 'మెగా158'..



మెగాస్టార్ చిరంజీవి 158వ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. బాబీ కొల్లి దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్ సంస్థ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది. 'వాల్తేరు వీరయ్య' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత చిరంజీవిబాబీ కొల్లి కాంబోలో రానున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే 40రోజుల షెడ్యూల్ పూర్తయిందని, దాదాపు సినిమా ప్రథమార్ధం మొత్తాన్ని తెరకెక్కించామని మేకర్స్ తెలిపారు. ఫ్యామిలీ ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్ అంశాల్ని బ్యాలెన్స్ చేస్తూ దర్శకుడు బాబీ అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చారని, భారీ స్థాయిలో డిజైన్ చేసిన యాక్షన్ ఎపిసోడ్స్ ఫస్టాఫ్‌లో హైలైట్‌గా ఉంటాయని చిత్రబృందం పేర్కొన్నది. ఈ నెల 22న చిరంజీవి జన్మదినం సందర్భంగా సినిమాకు సంబంధించిన కీలకమైన అప్‌డేట్ అందించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. అనస్వరరాజన్, నివేదా పేతురాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్నందిస్తున్నారు.

# ఫ్యాన్స్ గెట్ రెడీ.. యశ్ 'టాక్సిక్' మూవీ అడ్వాన్స్ బుకింగ్ ఎప్పటినుంచంటే?



రాకింగ్ స్టార్ యష్ నటించిన 'టాక్సిక్' సినిమా విడుదలకు కౌంట్‌డౌన్ మొదలైంది .గ్యాంగ్‌స్టర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులందరూ ఈ సినిమాను చూసేందుకు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో టాక్సిక్ సినిమా రిలీజ్ కు సంబంధించి ఒక పెద్ద అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ఆగస్టు 21 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. శుక్రవారం నుంచి అన్ని భాషల్లోనూ బుకింగ్‌లు ప్రారంభమవుతాయని సినిమా వర్గాలు తెలిపాయి. త్వరలోనే ఈ విషయంపై టాక్సిక్ దర్శక నిర్మాతలు ఒక అధికారిక ప్రకటన చేయనున్నారు. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన 'టాక్సిక్' సినిమాలో భారీ తారాగణం ఉంది. హీరో యశ్ సరసన కియారా అద్వానీ ప్రధాన కథానాయికగా జత కట్టింది. అలాగే నయనతార, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి, తారా సుతారియా వంటి అందాల తారలు కూడా ఈ సినిమాలో నటిస్తున్నారు. అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ సహా పలువురు విదేశీ నటీనటులు కూడా నటిస్తున్నారు.
కేవీఎన్ ప్రొడక్షన్స్, యష్ మాన్‌స్టర్ మైండ్స్ సంస్థలు సంయుక్తంగా టాక్సిక్ చిత్రాన్ని నిర్మించాయి. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా ఈ మూవీకి సంగీతం అందిస్తున్నారు. కొన్ని పాటలకు విశాల్ కూడా సంగీతం అందించారు.. ఇక ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. దీంతో ఈ సినిమా ప్రమోషన్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన కంటెంట్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ముఖ్యంగా ఇటీవల రిలీజైన టాక్సిక్ ట్రైలర్ కు యూట్యూబ్ లో సాలిడ్ రెస్పాన్స్ వస్తోంది. ఇక సినిమా ప్రమోషన్లలో భాగంగా నేషనల్ మీడియా ఛానెళ్లకు వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు యశ్. తద్వారా తన సినిమాను మరింతగా జనాల్లోకి తీసుకువెళ్లేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నాడు. ఇక టాక్సిక్ సినిమాలో యశ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తుండడం మరింత ఆసక్తికరంగా మారింది.



# రామ్‌చరణ్‌కు జోడీగా?

బ్లాక్‌బస్టర్ 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న సినిమా కావడంతో 'RC 17' (వర్కింగ్ టైటిల్)పై షూటింగ్ ప్రారంభానికి ముందే అభిమానుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఈ సినిమాలో కథానాయికగా రష్మిక మందన్నా, రుక్మిణీవసంత్‌ల పేర్లు మొన్నటివరకూ బలంగా వినిపించాయి. తాజాగా ఈ జాబితాలోకి 'దురంధర్' బ్యూటీ సారా అర్జున్ కూడా చేశారు. ఈ సినిమాలో కథానాయికగా సారా దాదాపు ఖరారైనదంటూ ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. వచ్చే నెలలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్టు వినికిడి. హై ఓల్టేజ్ స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈచిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ నిర్మించనున్నది. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Mukhtheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**